

ఆంగ్ల విభాగం విద్యార్థినికి డాక్టరేట్

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం పరిశోధక విద్యార్థిని వరికుంట తెలంగాణకు వైవియూ డాక్టరేట్ ప్రకటించింది. ఆంగ్ల శాఖ సహ ఆచార్యులు డాక్టర్ జిల్లెల మెర్సీ విజేత పర్యవేక్షణలో 'పర్స్పెక్టివ్స్ ఆన్ దళిత్ ఉమెన్ ఇన్ ద సెలెక్ట్ ఫిక్షనల్ వర్క్స్ ఆఫ్ ఫౌస్టీనా మేరీ ఫాతిమా రాణి (బామ) అండ్ వినోదిని' అనే అంశంపైన పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని వైవీయూ పరీక్షల విభాగానికి సమర్పించారు. వీసీ సూర్య కళావతి మార్గదర్శకం మేరకు నియమితులైన నిపుణుల బృందం గ్రంథాన్ని పరిశీలించిన నిష్పత్తుల సంతృప్తి డాక్టరేట్ అర్హత ధృవీకరించారు. కడప అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో తెలుగు సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

'పట్టు' పరికరాలు ఖరారు!

50 శాతం సబ్సిడీ మంజూరు
అర్హుల ఎంపికలో నిమగ్నం

జిల్లాలో మల్బరీ సాగు విస్తరణకు కసరత్తు ఊపందుకుంది. జిల్లా వ్యాప్తంగా మల్బరీ సాగుదారులకు 50 శాతం, ఎస్‌సి, ఎస్‌టి సాగుదారులకు 90 శాతం చొప్పున సబ్సిడీతో కూడిన పరికరాల పంపిణీకి కసరత్తు చేస్తోంది. మల్బరీ సాగు లాభదాయకతను వివరించడం ద్వారా సాగును మరింత విస్తరించడానికి ఉద్దేశించి అవగాహనా సదస్సుల దగ్గర నుంచి అధునిక సాంకేతిక మెళకువల ద్వారా ముందుకు సాగుతోంది. ఫలితంగా ఆదాయాన్ని పెంచుకోవడానికి ఉద్దేశించి పకడ్బందీగా కసరత్తు చేస్తోంది. జిల్లాలోని అర్హులైన మల్బరీ సాగుదారులను ఎంపిక చేసి ఆధునిక పరికరాలను అందించేపనిలో జిల్లా పట్టు పరిశ్రమ శాఖ యంత్రాంగం నిమగ్నమైంది.



శిక్షణ కార్యక్రమంలో అధికారులు, రైతులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా 600 ఎకరాల్లో మల్బరీ సాగవుతోంది. ఇటీవలి కాలంలో ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన సాధారణ రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్న సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మల్బరీతోటలను సాగు చేయడం ద్వారా నష్టాబారి నుంచి గట్టెక్కడం, నష్టనివారణను పరిమితం చేయడం, అనంతరం మల్బరీ కట్టింగుల ద్వారా వచ్చే ఆదాయ వివరాలను వివరించేందుకు అవగాహనా సదస్సులతో ముందుకు సాగుతోంది. ఇటువంటి అవగాహనా సదస్సుల ద్వారా ఇప్పటి వరకు మరో 120 ఎకరాలను అదనంగా మల్బరీ సాగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మల్బరీ సాగును విస్తరించడంలో భాగంగా రూ.10 లక్షల వ్యయంతో కూడిన ఆధునిక పరికరాలను అందిస్తోంది. సాధారణ రైతులకు రూ.50 శాతం, ఎస్‌సి, ఎస్‌టి సాగుదారులకు రూ.90 శాతం చొప్పున సబ్సిడీ లభించనుంది. ప్రధానంగా ఆర్‌కెవివై స్కీమ్ కింద సుమారు రూ.10 లక్షల విలువ కలిగిన పరికరాలను మంజూరు చేయనుంది. రూ.లక్ష విలువ కలిగిన రెండు చాకీ గదులు, రూ.50 వేలు విలువ కలిగిన ఐదు సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకో వచ్చని తెలుస్తోంది. వీటితో పాటు రూ.15 వేలు విలువ కలిగిన రెండు ప్లాస్టిక్ నేత్రికల యూనిట్లు, రూ.1.50 లక్షల విలువ కలిగిన ఫారంపాండ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. సాంకేతిక పరికరాల పంపిణీ చేయడానికి సంబంధించి అర్హులైన మల్బరీ సాగుదారులను గుర్తించేపనిలో జిల్లా పట్టు పరిశ్రమలశాఖ యంత్రాంగం నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

సమన్యాయం కోసం పాటుపడుదాం

- జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్

ప్రజాశక్తి - కడప అర్బన్

న్యాయం కోసం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు మన వద్దకు వచ్చినప్పుడు అన్ని పనులను నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించి ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశ హాలులో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమందరం ప్రభుత్వం నిర్దేశించిన గడువు మేరకు వారికి సేవలు అందించాలని, ఎలాంటి ప్రలోభాలకులోను కాకుండా, చట్ట పరిధిలో అందరికీ సమ న్యాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పెద్దిరాజు మాట్లాడుతూ మంచితనానికి కులం లేదు, మతం లేదని ప్రతి పేదవాడికీ న్యాయం చేసే మనస్సు కలిగి ఉండాలన్నారు. ఉద్యోగ భాధ్యతను గుర్తెరిగి పనిచేయాలని, పేదవాడికి సకాలంలో సహాయం అందించాలన్నారు. అవినీతి నిరోధక శాఖ సబ్-ఇన్స్పెక్టర్ నౌషాద్ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమేనని, ప్రభుత్వ ఉద్యోగులమైన మనమందరం ప్రజలకు జవాబుదారీతనంతో పని చేయాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ అందరితో అవినీతిని అరికడదాం దేశాభివృద్ధికి పాటుపడదాం అని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిపిఒ వెంకట్రావు, స్పెషల్ కలెక్టర్లు మోహన్‌రావు, శాంత కుమారి, డిప్యూటీ కలెక్టర్ ఎం.సి. నరసింహులు, కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి విజయ్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఆర్‌ఓ గంగాధర్ గౌడ్



కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రికవరీని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల హెల్త్ అలవెన్స్ రికవరీని ఉపసంహరించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్మిక సమస్యలు పరిష్కరించాలని కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపాల్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం హెల్త్ అలవెన్స్ ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. హామీ అమలు చేస్తూ ఉన్నట్టుండి రికవరీ చేయడం దుర్మార్గమన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్, సెమీస్కిల్డ్ వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నగర అధ్యక్షులు సుంకర రవి, నాయకులు ఆదామ్, కొండయ్య, నాగరాజు, ఆనంద్, సాయి, శివ, కొండమ్మ, రమా, కార్మికులు పాల్గొన్నారు.

హమాలీలకు కూలి రేట్లు పెంచాలి

- రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారెడ్డి డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్



మోకాళ్లపై నిరసన వ్యక్తంచేస్తున్న హమాలీలు

బేవరేజ్ హమాలీ కార్మికులకు ఎగుమతి కూలి రేట్లు పెంచాలని హమాలీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వి. సుబ్బారెడ్డి కోరారు. శనివారం పారిశ్రామిక వాడలో ఉన్న బేవరేజ్ డిపో వద్ద హమాలీ కార్మికులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ హమాలీ సంఘాలకు, మద్యం రవాణా సంస్థ సిగ్మా వారికి రాష్ట్ర ఏపీఎస్ బీసీఎల్ అధికారుల సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందం 2001, అక్టోబర్ 31 తో ముగిసిందని పేర్కొన్నారు. కూలి రేటు పెంచాలని పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. రెండు సంవత్సరాల్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని చెప్పారు. ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని కోరారు. ప్రస్తుతం ఉన్న రూ. 7 నుంచి రూ.10కి పెంచాలని చెప్పారు. కంపెనీ యాజమాన్యం, అధికారులు స్పందించని పక్షంలో ఈనెల 15న సమ్మెకు వెళతామని హెచ్చరించారు. ఇప్పటికే సమ్మె నోటీసు అందించామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రఘురామయ్య, మనోహర్ రెడ్డి, సుబ్బరాయుడు, రెడ్డి ప్రసాద్, సుబ్బారెడ్డి, భరత్, వేణు, నరేష్, కొండారెడ్డి, హమాలీలు పాల్గొన్నారు.

వైద్య సేవలకు దూరం
డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్
అధునాతన పరికరాలు వచ్చినా నిరుపయోగం

ప్రజాశక్తి - కడప అర్బన్

పెండ్లిమర్రి మండలం, నందిమండలంలో ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ నిరుపయోగంగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన క్లినిక్‌ను ఎంపిపి పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆరు నెలల కిందట ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి వైద్య సేవలు అందుబాటులో లేవు. కంప్యూటర్లు, పరికరాలు, ఫర్నీచర్ ఇప్పటి వరకు ఆరోగ్య కేంద్రంలోకి చేరలేదు. వైద్య అధికారులు, సిబ్బందిని నియమించినా క్లినిక్ మాత్రం తెరుచుకోవడం లేదు. సిబ్బంది వచ్చి సచివాలయంలోకి వెళ్లడం, అక్కడి నుంచి అటే ఇంటికి వెళుతున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. పులివెందుల-కడప ప్రధాన రహదారిపై ఉన్న క్లినిక్ పరిస్థితి ఇలా ఉంటే . ఇక మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వాటి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 64 రకాల మందులు, 17 రకాల పరీక్షలు చేయడానికి వీటిని ఏర్పాటు చేశారు. డాక్టర్, సూపర్‌వైజర్ పర్యవేక్ష కొరవడడంతో విలేజ్ క్లినిక్ ప్రజలకు అందుబాటులోకి రాకుండా పోయింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వెంటనే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలకు కోరుతున్నారు.



నందిమండలంలో నిరుపయోగంగా ఉన్న విలేజ్ క్లినిక్

వయోపరిమితి పెంపు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎపిజిఎల్ఐ పాలసీలు పొంద డానికి గరిష్ట వయోపరిమితి అర్హతను 55 నుంచి 57 ఏళ్లు పెంచడ మైందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఈ విషయాన్ని గుర్తించాలని జిల్లా బీమా కార్యాలయ సహాయ సంచాలకులు ఎం.రమేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల విరమణ వయోపరిమితిని 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచడంతో ఎపిజిఎల్ఐ పాలసీ పొంద డానికి గరిష్ట వయోపరిమితి నూతన సవరణ వర్తిస్తుందని పేర్కొన్నారు.

మంత్రిని సత్కరించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడపకు విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కాకాని గోవర్ధన్ రెడ్డిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా శనివారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అన్నమయ్య జిల్లా డిఆర్‌సి. సమావేశంలో పాల్గొనే నిమిత్తం కడపకు చేరుకున్న మంత్రి కాకానిని ఆయన సన్నిహితుల నివాసంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషాతో పాటు స్థానిక కార్పొరేటర్ షఫీ మర్యాదపూర్వకంగా కలసి పూలగుచ్ఛాలు అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి

ప్రజాశక్తి -కడప అర్బన్



విద్యార్థిని అభినందిస్తున్న డిప్యూటీ సిఎం

మానసిక వికాసానికి క్రీడలు దోహదపడుతాయని ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. అంతర్జాతీయ స్కేటింగ్‌కు ఎంపికైన రైల్వేకోడూరు చెందిన పునీత్‌రామ్‌కు తన సొంత నిధులను నుంచి రూ.10వేలు చెక్కును శనివారం తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యను అభ్య సించడంతో పాటు క్రీడలలో కూడా రణించాలన్నారు. క్రీడలు మానసిక వికాసాన్ని పెంపొందించడంతో పాటు ఆరోగ్యాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తుందన్నారు. పునీత్ రామ్ ఇప్పటికే వివిధ స్థాయిలో 43 గోల్డ్ మెడల్స్ 3 సిల్వర్ మెడల్స్ గెలిచారన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో గెలుపొంది అంతర్జాతీయ స్కేటింగ్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థిని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఏపీ టాక్స్ ప్రాక్టీషనర్ అండ్ కన్సల్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పఠాన్ షరీఫ్ ఖాన్, ఎన్ఆర్ఐ ట్రస్ట్ చైర్మన్ తోటా కృష్ణ అభినందించారు.

అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

కడప అర్బన్ : నగర మేయర్ కె.సురేష్ బాబు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషాతో కలిసి నగర అభివృద్ధి పనుల పురోగతిపై నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనాలతో సమీక్షించారు. శనివారం నగరపాలక సంస్థ మేయర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో కడప నియోజకవర్గంలోని డివిజన్లకు మంజూరైన అభివృద్ధి పనులు -15 వ ఫైనాన్స్ పనుల పురోగతి పై ఉపముఖ్యమంత్రి, నగర మేయర్ సంబంధిత మున్సిపల్ అధికారులతో చర్చించారు. సమావేశంలో నగర కార్పొరేటర్లు చెన్నయ్య, కిరణ్, మల్లికార్జున, శ్రీరంజన్, సుబ్బారాయుడు, సూర్యనారాయణ, రెడ్డి ప్రసాద్, బంగారు నాగయ్య పాల్గొన్నారు.

సుడిదోమ నివారణకు చర్యలు

పోరుమామిళ్ల : ఇటీవల కాలంలో కురిసిన వర్షానికి వరి పంటకు సుడిదోమ ఆశించిందని, నివారణకు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వరహరి కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వరి వేసిన రైతులు సుడిదోమను నివారించడానికి డినాటో ఫురాన్ 0.4 గ్రామ్ , ఫ్రెంట్రోజన్ 0.6 గ్రామ్ ను ఒక లీటర్ నీటిలో కలిపి మొక్క మొత్తం తడిసేలాగా ముఖ్యంగా మొదలు తడిసేలాగా పిచికారి చేయాలన్నారు. పిచికారి చేసే ముందు పొలంలో నీటిని మొత్తం బయటికి తీసివేయాలన్నారు. సుడిదోమ రాకుండా వరి నాట్లను 15 సెంటీమీటర్ల దూరంతో నాటుకోవడం, రెండు మీటర్లకు కాలిబాటలు పెట్టుకోవడం, గట్ల మీద బంతి, లాంటి మొక్కలు వేసుకోవడం, నత్రజని వాడకాన్ని నాలుగు దఫాలుగా ఉపయోగించడం వల్ల సుడిదోమాను నివారించవచ్చు అన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తాం

ప్రజాశక్తి-కాశినాయన



చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

మండలంలోని నరసాపురం, వరికుంట్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందజేస్తామని, వ్యవసాయానికి కోతల్లోని విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యమని లైన్‌మెన్ తోటసుబ్బరాజు పేర్కొన్నారు. శనివారం నరసా పురం లోని బాలరాజుపల్లె మార్గం లో విద్యుత్ వైర్లకు అండగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు. నరసాపురం నుంచి వరికుంట్ల వరకు రైతులకు, గృహ వినియోగదారులకు ఎలాంటి సమస్యలొచ్చినా ఆయన ముందుండి పరిష్కరిస్తున్నారు. రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-చెన్నూరు

అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని శేషయ్యగారిపల్లి, రుద్రభారతిపేట, శాటిలైట్ సిటీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఏ కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరించారు. మూడేళ్లలో ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందించారని చెప్పారు. ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరు చేయాలని, డ్రెయినేజీలు, రోడ్లు, శ్మాశాన వాటికలకు స్థలం కేటాయించాలని ప్రజలు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ కరీముల్లా, స్థానికులు బుజ్జిరెడ్డి , చంటి, శ్రీనివాసులు, సుబ్బారావు, శివ , మద్దెల కేశవతో పాటు 50 వ డివిజన్ కార్పొరేటర్ కె రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి మాసిమ బాబు, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఆర్, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, ఎంపిటిసిలు ఎర్ర సాని నిరంజన్ రెడ్డి, ఎర్ర సాని మోహన్ రెడ్డి, సర్పంచులు సిద్ధిగారి వెంకటసుబ్బయ్య, సొంతం నారాయణరెడ్డి, తుంగ చంద్రశేఖర్ యాదవ్, మండల కో-ఆప్షన్ నెంబర్ వారిస్, వైసిపి నాయకులు పెడబల్లె ప్రదీప్ కుమార్ రెడ్డి, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైయస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అదనపు గదులు లేక విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి-చెన్నూరు



నిర్మాణంలో ఉన్న భవనంలో విద్యార్థుల చదువులు

మండల కేంద్రమైన చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదులు లేక నిర్మాణంలో ఉన్న గదులలో నేలపై విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఇటీవల మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉన్నత పాఠశాలలకు విలీనం చేయడంతో సరైన గదులు, లేక మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత పాఠశాలలో అదనపు గదులు మౌలిక సదుపాయాల కోసం రెండేళ్ల కిందట నా బార్డు నిధుల నుంచి రూ. కోటి 94 లక్షల నిధులు మంజూరయ్యాయి. పాఠశాలలో పాత తరగతి గదుల మరమ్మతులు, అదనపు గదులు నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. కాంట్రాక్ట్ పనులు దక్కించుకున్న గుత్తేదారు నిర్మాణ పనులను కొనసాగిస్తూ అర్ధాంతంగా పనులు ఆపేసి వెళ్లిపోయారు. తిరిగి మరోసారి టెండర్లు పిలవడంతో పనులు దక్కించుకున్న గుత్తేగారు అదనపు గదులు నిర్మాణంలో జాప్యం చేయడంతో పనులు ముందుకు సాగడం లేదు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడం సరిపడ గదులు లేకపోవడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సమస్యగా మారింది. ఈ విషయంపై బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ. పద్మనాభం స్పందిస్తూ భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు సంబంధిత గుత్తేదారిపై ఒత్తిడి చేస్తున్నామని త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు.

చంద్రబాబుకు రక్షణగా ఉంటాం



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న జియావుద్దీన్

కడప అర్బన్ : చంద్రబాబుకు రక్షణగా రాష్ట్ర తెలుగు యువత మొత్తం రోడ్లపైకి వస్తామని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియావుద్దీన్ పేర్కొన్నారు. శనివారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిగామలో చంద్ర బాబునాయుడు రోడ్ షో కాన్వాయ్‌పై రాళ్లతో చేసిన దాడిలో సెక్యూరిటీ చీఫ్ మధుకు గాయాలయ్యాయని తెలిపారు. తెలు గుదేశం పార్టీకి ప్రజల్లో వస్తున్న స్పందన చూసి ఓర్వలేక కొందరు వైసీపీ గూం డాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. దాడి చేసిన వారిని అరెస్టు చేసి, వెనక వున్న కుట్రను బహిర్గతం చేయాలని పేర్కొన్నారు. చంద్రబా బుకు పూర్తి భద్రత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వైసిపి పాలనకు త్వరలో చరమగీతం పాడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో 44వ డివిజన్ నాయకులు ఖాజాపీర్, తెలుగుయువత నాయకులు అడ్వకేట్ శివ, అడ్వకేట్ ఇమ్రాన్, మహమ్మద్, తాజుద్దిన్ పాల్గొన్నారు.

'కెఎస్ఆర్ఎం'లో హ్యాండ్‌బాల్ ఎంపికలు

ప్రజాశక్తి - కడప అర్బన్



హాకీజట్టుతో యూనివర్సిటీ, కెఎస్ఆర్ఎం అధికారులు

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జెఎన్‌టియు విశ్వవిద్యాలయం అనంతపురం హ్యాండ్ పురుషులు, మహిళల జట్ల ఎంపికలు శనివారం నిర్వహించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ జెఎన్ టియు అనంతపురం సెక్రటరీ జోజి రెడ్డి ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. ఇందులో భాగంగా రాయలసీమ నుంచి వివిధ ఇంజినీరింగ్ కళాశాల నుంచి 40 టీమ్‌లు పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్ మూర్తి తెలిపారు. ఉమెన్ జట్టు ఎంజి యూనివర్సిటీ కొట్టాయంలో, మెన్ జట్టు పెరియార్ యూనివర్సిటీ సేలంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన జట్లకు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్స్ కో-ఆర్డినేటర్ నారాయణ, వంశీ నాయక్ పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-కడప అర్బన్



నజీర్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

జిల్లాలో టిడిపి బలోపేతానికి ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి నాయకత్వంలో కృషి చేస్తానని టిడిపి రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి గగ్గుటరు నజీర్ అన్నారు. శనివారం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బాలదాసు ఆధ్వర్యంలో బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి కార్యాలయంలో నజీర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు గురువారం రాష్ట్ర మైనార్టీ సెల్ ఏర్పాటులో భాగంగా కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండలం దూదేకుల సామాజికవర్గానికి చెందిన తనను టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర సెక్రటరీగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు నమ్మకాన్ని నిలబెడతానని, పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. కార్యక్ర మంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి సానపురెడ్డి రవి శంకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్, టిడిపి మైనార్టీ నగర అధ్యక్షుడు ఇమ్రాన్, నగర ఉపాధ్యక్షులు లింగాల శివ శంకర రెడ్డి, సయ్యద్ మహమ్మద్, నాయకులు కొండా సుబ్బయ్య, రామాంజనేయులు, బాబయ్య, అబ్దుల్లా పాల్గొన్నారు.

రిమ్స్ పీజీ వైద్య విద్యార్థి అదృశ్యం

కేసు ఛేదించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి - కడప సిటి

కడప నగర శివారులోని జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గైనకాలజీ విభాగంలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థి అదృశ్యమయ్యారు. అనతి కాలంలోనే రిమ్స్ పోలీసులు కేసు ఛేదించి ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. రిమ్స్‌లో పీజీ చేస్తున్న ఈమె కడప నగరంలో నివాస ముంటున్నారు. శనివారం ఉదయం 8. 30 గంట లకు కళాశాలకు ఇంటి వద్ద నుంచి బయలు దేరారు. ఉదయం 10. 30 గంటల ప్రాంతంలో తల్లిదండ్రులు రిమ్స్ హాస్పి టల్ గైనకాలజీ విభాగం వద్దకు చేరుకుని తమ కుమార్తె గురించి ఆరా తీశారు. అక్కడ ఆమె కన్పించకపోవడంతో డిపార్ట్‌మెంట్‌లోని వైద్యులను నిలదీశారు. విద్యార్థి కళాశాలకు రాలేదని వైద్యులు సమాధానమిచ్చారు. ఈవిషయంపై సిఎస్ ఆర్ఎంఒ స్పందిస్తూ తలిదండ్రులు ఆస్పత్రికి చేరుకుని వారి కుమార్తె అదృశ్యంపై తన దృష్టికి తీసు కొచ్చారని, అసలు విద్యార్థి డిపార్ట్‌మెంట్‌కు రాలేదని తేల్చి చెప్పామని పేర్కొన్నారు. కుమార్తె అదృశ్యంపై తల్లిదండ్రులు రిమ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రిమ్స్ సిఐ ఆధ్వర్యంలో పోలీసులు కేసు ఛేదించి తల్లిదండ్రులకు అప్పగించారు

మొక్కుబడే!

ప్రజా'దృష్టి'

'వొట్టిమాటలు కట్టిపెట్టి గట్టిమేల్ తలపెట్టవోయ్' అన్న స్ఫూర్తి మంత్రం కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో మచ్చుకైనా కనిపించిన దాఖలాల్లేవ్. రెండ్రోజుల కిందట రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని ఆధ్వర్యంలో రాష్ట్ర హెల్త్‌సెక్రటరీ కృష్ణబాబు ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆడిటోరియంలో నిర్వహించిన సమీక్ష మాటల గారడీగానే మిగిలిపోయింది. రీజినల్ డైరెక్టర్ పరిధిలోని వైద్యుల, నర్సింగ్ పోస్టుల ఖాళీల వివరాలు, వ్యాక్సినేషన్ సరళి, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు, పారిశుధ్య కార్మికులకు జీతాలు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, మందుల కొరత వంటి అంశాలపై ఆరా తీయడం వరకు భాగానే ఉంది. ప్రభుత్వాస్పత్రుల్లోని మందుల నాణ్యత, మందుల సంఖ్య ఎంత, మార్కెట్లోని మందుల నాణ్యతను తలపిస్తున్నాయా, లేదా అనే అంశాలను పరిశీలించాల్సి ఉంది. ఇటువంటి లోతైన పరిశీలనతో మరింత మేలు ఒనగూరి ఉండేది. ప్రభుత్వాస్పత్రుల్లో స్కానింగ్ సెంటర్లు మరమ్మతులను సత్వరమే చేయడానికి అవసరమైన చర్యలపై దృష్టి సారించి ఉంటే వేలాది రూపాయలు ప్రయివేటు స్కానింగ్ సెంటర్లకు ముట్టజెప్పుకునే దుస్థితి తగ్గి ఉండేది. ప్రభుత్వాస్పత్రుల్లోని వైద్యుల వేతనాలను హేతుబద్ధీకరించిన అనంతరం వైద్యుల ప్రయివేటు ప్రాక్టీస్‌ను నిలువరిస్తే మరింత ప్రయోజనం లభించేది. కడప ప్రభుత్వాస్పత్రిలో పని చేసే నాణ్యమైన స్పెషలిస్టు వైద్యులను సిహెచ్‌సి, పిహెచ్‌సిలకు పంపడం ఎంతవరకు కరెక్టో ఆలోచన చేయాలి. నాణ్యమైన స్పెషలిస్టు వైద్యులను కడప, ప్రొద్దుటూరు వంటి జిల్లాస్థాయి ఆస్పత్రుల్లో ఉంచితేనే నాణ్యమైన వైద్యం అందేది. పిహెచ్‌సి, సిహెచ్‌సిల్లో స్పెషలిస్టు వైద్యం అందించడానికి సంబంధించిన పరికరాలు ఉండవనే విషయం అందరికీ తెలిసిందే. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉరుముతోంది. పేరు ఫ్యామిలీ డాక్టర్, ఆచరణ ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకున్న రోగులకు, దీర్ఘకాలిక రోగులకు మాత్రమే వైద్య సేవలు అందించడానికి పరిమితం చేయడాన్ని ఫ్యామిలీ డాక్టర్ విధానమని ఎలా అంటారో పాలకులకే తెలియాలి. ఇది 104 వైద్య సేవల తరహాకు పరిమితం కావడమనే వాదన వినిపిస్తోంది. రీజినల్ డైరెక్టర్ పరిధిలోని వైద్యుల, ఎఎన్ఎంల, స్టాఫ్‌నర్సుల లభ్యత, కొరత, హేతుబద్ధత, సర్దుబాటును ప్రశ్నించడం సరే, కింది స్థాయి ఉద్యోగుల బదిలీల జాతరలో సాగుతున్న అవినీతి కట్టలు తెంచు కుంటోంది. ఇటువంటి కీలక అంశాల్లో పారదర్శ కతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో వైద్యఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లను ఇష్టారాజ్యంగా చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇటు వంటి సమీక్షలను మూడు నెలలకు ఒకసారి విద్య, వైద్యం, వ్యవసాయం, నీటిపారుదల, పరిశ్రమలు వంటి కీలకమైన డిపార్టుమెంట్ల పురోగతి పట్ల లోతుగా సమీక్షలు నిర్వహిస్తే జవాబు దారీతనం పెరగడంతోపాటు ఫలితాలు ఉంటాయని చెప్పవచ్చు. డిపార్టుమెంట్ల వారీగా నిస్తేజంగా ఉన్న అధికారుల్లో కదలిక తేవాల్సి ఉంది. జిల్లా పరిషత్, డిఆర్‌సి వంటి సమావేశాల తరహాలో తంతుగా సమీక్షలు నిర్వహిస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

- ప్రజాశక్తి- కడప ప్రతినిధి

వెండి మకర తోరణం వితరణ

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని బలిజ సంఘం వీధిలో ఉన్న శ్రీ మంగళ గౌరి ఆలయానికి ఎంపిటిసి పద్మా జయలక్ష్మిదేవి, పద్మా రాజ్‌కుమార్ వెండి మకర తోరణాన్ని అందజేశారు. మంగళగౌరి ఆలయంలో కార్తీకమాస గౌరిదేవి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మూడు కిలోల వెండి మకర తోరణాన్ని ఎంపిటిసి కుటుంబ సభ్యులతో కలిసి సమర్పించారు. అనంతరం వారిని ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా సన్మానించారు. దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు పద్మా రాజకుమార్, పద్మా ప్రవీణ్‌కుమార్, పద్మా సంపత్, పద్మా అర్చన, బలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్తూరు రెడ్డయ్య, సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల ఆర్థిక సాయం

గండిక్షేత్రంలోని శ్రీవీరాంజనేయస్వామి శాశ్విత నిత్యాన్నదాన పథకానికి శనివారం ఆలయ పాలకమండలి సభ్యుడు లోమడ రామాంజనేయులురెడ్డి రూ.50,116 విరాళం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి చెప్పారు. దాత కుటుంబ సభ్యులతో కలిసి అసిస్టెంట్ కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, దాత తండ్రి డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి లోమడ యోగాంజనేయులురెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ నిధులపై ఆడిట్

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని మాడూరు, టిఓ పల్లె, నాగులపల్లె, ఎన్ ఓబాయపల్లి, సోమాపురం గ్రామ పంచాయతీ నిధులపై శనివారం ఆడిట్ నిర్వహించారు. సీనియర్ ఆడిటర్ సురేష్, భారతీ పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులు, ఎంబుక్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020-21 ఏడాదికి సంబంధించి గ్రామ పంచాయతీ నిధులపై ఆడిట్ చేపడుతున్నామన్నారు. అన్ని గ్రామ పంచాయతీ నిధుల వినియోగంపై ఆడిట్ పూర్తి కాగానే వివరాలు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాదాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలు క్షీణించడం దురదృష్టకరం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకు దిగజారడం దురదృష్టకరమని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాజీ సిఎం చంద్రబాబు కాన్వాయ్‌పై దుండగులు రాయి విసరడంతో చీఫ్ సెక్యూరిటీ అధికారి మధుకు రక్త గాయం కావడం దారుణమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి సక్రమంగా లేదనడానికి చంద్రబాబుపై రాయి విసరడం తాజా ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ దుశ్చర్యను ఖండిస్తున్నట్లు చెప్పారు. నిందుతుడిని అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా ఇప్పటం గ్రామంలో పేదల ఇళ్లను ప్రభుత్వం జెసిబిలతో కూల్చడం దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలో భూములు, ఇసుక, మట్టి, మద్యం, ఎర్రచందనం మాఫీయా వీరవిహారం చేస్తున్నట్లు తెలిపారు.

చేనేతపై జిఎస్‌టిని రద్దు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

చేనేత ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం విధించిన 5 శాతం జిఎస్‌టిని రద్దు చేయాలని కడప జిల్లా చేనేత పరిరక్షణ కమిటీ అధ్యక్షులు కారుమూరి వెంకటరమణయ్య డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాల్లో పట్టణ, మండలాల్లో తరతరాలుగా కులవృత్తులను చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. వాటిని నమ్ముకుని జీవనాన్ని కొనసాగిస్తున్న చేనేతలకు ప్రభుత్వం అండగా నిలబడాల్సి ఉందన్నారు. నూలు, సిల్క్ రంగులకు రాయితీలు, సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. కానీ మోడీ ప్రభుత్వం చేనేతలపై ఐదు శాతం జిఎస్‌టి పన్ను విధించడం చాలా బాధాకరమన్నారు. వెంటనే దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా వివిధ పద్ధతుల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామని వెంకటరమణ హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన అవసరం

- జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. సున్నపురాళ్లపల్లె గ్రామం, పట్టణంలోని సబ్ జైల్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సివిల్ కేసులన్నీ కోర్టులో దావా వేయాలని, క్రిమినల్ కేసు అయితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే అక్కడి నుంచి ఎఫ్ఐఆర్ ద్వారా విచారణ చేసి కోర్టుకు పోలీసు అధికారులు సబ్మిట్ చేస్తారన్నారు. అనంతరం విచారించి న్యాయం చేస్తామన్నారు. గృహ హింస చట్టాలపైన, బాలల హక్కులపైన, బాల్య వివాహాలపైన అవగాహన ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలన్నారు. ఈనెల 12న స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా బాధితులు ఉంటే రాజీమార్గాన సమస్యను పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిఐ సదాశివయ్య, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, సబ్ జైలర్ హర్షవర్ధన్ రెడ్డి, న్యాయవాదులు, ఖైదీలు, ప్రజలు పాల్గొన్నారు.

రైల్వే ప్రహరీతో ప్రజలకు ఇక్కట్లు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ప్రొద్దటూరు రోడ్డులోని రైల్వేస్టేషన్ మలుపు వద్ద రైల్వే అధికారులు ప్రహారీని ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. రాణి వనం, ప్రకాశనగర్, మెయిన్ బజార్ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైల్వేస్టేషన్ అటు వైపు మునిసిపల్ కార్యాలయం, ప్రభుత్వ బాలుర పాఠశాల, బ్యాంకులు, పోలీస్‌స్టేషన్, ఇఎస్ఐ ఆసుపత్రి వంటి కార్యాలయాలు, ఇటువైపు ఎంపిడిఒ, రెవెన్యూ, వ్యవసాయ, బిఎస్ఎన్ఎల్, పోస్టాఫీస్, బాలికల పాఠశాలతోపాపాటు నాపరాళ్ల పరిశ్రమలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల, ఇతర పనులతో ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రహరీ లేకపోవడంతో ఇప్పటి వరకు వారు సౌకర్యవంతంగా తిరిగారు. ప్రస్తుతం ఆ దారిని రైల్వే అధికారులు పూడ్చివేశారు. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. ఆ దారిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, లేదంటే ప్రహరీ తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యను స్థానిక కౌన్సిలర్ అలీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం ఎమ్మెల్యే ప్రహరీని పరిశీలించారు. అనంతరం ప్రజల, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రహరీని తొలగించి దారి వదలాలని, లేదంటే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్టేషన్ మేనేజర్ ఉమామహేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అలీ, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అసత్య ఆరోపణలు బాధాకరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గత నెల 13న పొదుపు సంఘాల మహిళల డబ్బు కాజేసిన విషయమై టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఇంటి వద్ద జరిగిన ఘటనల నేపథ్యంలో ఇరు వర్గాలపై పోలీసులు నిష్పక్షపాతంగా కేసులు నమోదు చేసి జైలుకు పంపారని, అందులో తనకు ఎలాంటి సంబంధంలేదనప్పటికీ టిడిపి నేతలు అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయ చాంబర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందు అందరూ సమానులేనని పేర్కొన్నారు. తనను బలహీన పరిచేందుకు అసత్య ఆరోపణలు చేస్తూ.. తమ ఉనికిని చాటుకునేందుకు టిడిపి నేతలు ప్రయత్నించడం దారుణమన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని, న్యాయ మూర్తుల నిర్ణయానికి మనందరం కట్టుబడి ఉండాల్సిందేనని తెలిపారు. ఇప్పటికైనా వాస్తవాలను తెలుసుకుని ఆరోపణలు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగశేషారెడ్డి, వరికూటి ఓబుల్‌రెడ్డి, రాయపురెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, పద్మావతి, కళ్యాణి, వంశీధర్‌రెడ్డి, గురనాథ్ పాల్గొన్నారు.

హమాలీల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్నంగా ధర్నా నిర్వహిస్తున్న హమాలీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎగుమతి కూలి రేట్లు పెరిగిన ప్రస్తుత పరిస్థితుల, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పెంచాలని, ఐఎంఎల్ గోడౌన్ ఎదుట సిఐటియు హమాలీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం హమాలీలతో కలిసి అర్ధనగ్నంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఎగుమతి కూలి రేట్లు పెంచాలని హమాలీల నిరసన న్యాయమైందన్నారు. ఎగుమతి కూలి రేట్లు ఒప్పందం 2021 అక్టోబర్‌తో ముగిసిందన్నారు. నవంబర్ 2021 నుంచి అగ్రిమెంటు ప్రకారం కొత్త రేట్లు అమలు కావలసి ఉందన్నారు. ఈ విషయాన్ని గత జులై నెలలో ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. 2022 జులై 18నుంచి తాము తలపెట్టిన సమ్మెను ఎపిఎస్‌బిసిఎల్ ఎండి మూడు నెలల గడువు కోరినందున తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. నేటికి ఎగుమతి రేట్లు పెంచలేదన్నారు. ఈ సమస్యను ఈనెల 14 లోపు పరిష్కరించాలన్నారు. లేకుంటే 15నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు దక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సంక్షేమ ఫలాలు అర్హులకు దక్కాలన్నదే జగన్ ప్రభుత్వ లక్ష్యం అని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం గోపవరం పంచాయతీ పరిధిలోని సాయికుటీర్ రోడ్డు, వివిఎన్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీలోని ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలుకగా సర్పంచ్ మోషే, ఉప సర్పంచ్ రాఘవరెడ్డి, ఎంపిటిసి భూసం రవీంద్రనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సచివాలయ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి శేఖర్ యాదవ్, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ డి.భాస్కర్‌రెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ మారుతీ ప్రసాద్, బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రజినీ, ఆచార్యుల కాలనీ శివారెడ్డి పాల్గొన్నారు.

ముద్దనూరు : ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. మండలంలోని గంగాదేవిపల్లిలో శనివారం మాజీ ఎంపిపి మునిరాజా రెడ్డి, ఉప మండల అధ్యక్షులు పుష్పలతతో కలిసి ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. అనంతరం ప్రతి గడపకు తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, మండల కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, భారతి, నాయకులు నాగిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వీరారెడ్డి, మునిరెడ్డి, మూలరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, ఆదినారాయణరెడ్డి, చిరంజీవిరెడ్డి, విశ్వనాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌టిపిపిలో కొత్త నియామకాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన జెపిఎ పోస్టులను రద్దు చేయాలని టిఎన్‌టియుసి కడప పార్లమెంట్ అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ డిమాండ్ చేశారు. స్థానిక తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎర్రగుంట్ల ఆర్‌టిపిపిలో రాష్ట్ర ప్రభుత్వం 39 మందిని జెపిఎగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆర్‌టిపిపి ప్లాంట్‌కు ఏ మాత్రం అనుభవం లేని వ్యక్తులను ఉద్యోగాల్లోకి తీసుకోవడం అన్యాయమన్నారు. 2019 ఎన్నికల్లో జమ్మలమడుగు బహిరంగ సభలో అప్పటి ప్రతిపక్ష నేత, ఇప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆర్‌టిపిపిలోని ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగిని పర్మినెంట్ చేస్తానని చెప్పారన్నారు. ఇప్పుడు అర్హత, అనుభవం కలిగిన ల్యాండ్ లూజర్స్, కాంట్రాక్టు కార్మికులను పక్కనపెట్టి కేవలం వారి స్వలాభాల కోసం కొత్త వ్యక్తుల నియామకాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. కొత్త నియమాకాలను రద్దు చేయకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా అధికార ప్రతినిధి దేశంరెడ్డి, పట్టణ కార్యదర్శి దాదాపీర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలో జగనన్న కాలనీకి సంబంధించి ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, తహశీల్దార్ నాగేశ్వరరావు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం వారు హౌసింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా డిసెంబర్ 21న రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఇళ్లు ప్రారంభోత్సవం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని అన్నారు. అనుకున్న సమయానికి మొత్తం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ఆర్ఎస్ షాహిద్ ను కోరారు. ఇటుకలు, సిమెంట్, స్టీల్, ఇసుక సరైన సమయానికి వస్తే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా అవసరమైన ఇటుకలను సరఫరా చేయాలని తయారీదారులను తహశీల్దార్ కోరారు. సమావేశంలో హౌసింగ్ డిఇ విజయబాబు, ఎఇ శ్రీనివాసులు, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్ వెనక్కి తీసుకోవడం అన్యాయం

- సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మున్సిపల్ పారిశుద్ధ కార్మికులు పోరాడి సాధించుకున్న ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు చెల్లించిన దానిని కార్మికుల జీతాల నుంచి రికవరీ చేయాలనడం అన్యాయమని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్మికులతో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో మున్సిపల్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, పట్టణ అధ్యక్షులు చంటి, పట్టణ కోశాధికారి రాఘవ, వర్కింగ్ ప్రెసిడెంట్ రవణమ్మ, ఉపాధ్యక్షులు గురమ్మ, రమాదేవి, లక్ష్మీదేవి, శాంతి, కార్యదర్శులు మోహన్, రవికుమార్, జాకోబు, కార్మికులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - వేముల

మండలంలోని యుసి ఐఎల్‌లో విజిలెన్స్ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా అవినీతి నిర్మూలనకు సంబంధించి పలు పోటీల్లో కెజిబివి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు, యుసిఐఎల్ ఉద్యోగులకు జనరల్ మేనేజర్ ఎంఎస్ రావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యుసిఐఎల్ అధికారులు, కెజిబివి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఆర్‌డిఒ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో శనివారం సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆ కమిటీ చైర్మన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ ఆర్‌డిఒ శ్రీనివాసులు మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు పిసి, పిఎన్‌డిటి చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. అమలు చేయని సెంటర్లు, ఆస్పత్రుల్లో మిషన్‌ను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఉప వైద్యాదికారి, కమిటీ కన్వీనర్ శశికళ మాట్లాడుతూ డాక్టరు లింగ నిర్ధారణ చేశాడని తెలిస్తే మొదటి దశలో మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తారన్నారు. రెండోసారి అదే డాక్టర్ పట్టుబడితే రూ.50,000 జరిమానా, శాశ్వత కాలం డాక్టర్ పట్టాను రద్దు చేయనున్నట్లు పేర్కొన్నారు. లింగ నిర్ధారణకు వచ్చిన వ్యక్తులపై కూడా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ సదాశివయ్య, సిడిపిఒలు రాజేశ్వరి, ముంతాజ్ బేగం, అంగన్వాడీ సూపర్వైజర్లు, ఎన్‌జిఒ సుబ్బారెడ్డి, సిఐ శ్రీనివాసులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అర్బన్ ఎస్ఐగా హుస్సేన్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల అర్బన్ ఎస్ఐగా ఎన్‌కెఎం హుస్సేన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై పులివెందులకు వచ్చానన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న గోపీనాథ్‌రెడ్డి జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, మైనింగ్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఎస్.వి ఫంక్షన్ హాల్‌లో అధికారులు విజిలెన్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎర్రగుంట్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న గనులు, నాపరాళ్ల పరిశ్రమల, క్రషర్ మిషన్ యజమానులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విజిలెన్స్ అధికారి ఉమా మహేశ్వర్, మైన్స్ ఎడి రాజేష్ కుమార్, విజిలెన్స్ సిఐ బాషా హాజరయ్యారు. కార్యక్రమంలో మైన్స్ ఆర్ఐ, సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : న్యాయం కోసం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు మన వద్దకు వచ్చినప్పుడు అన్ని పనులను నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించి ప్రజాప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేయాలని రీజినల్ విజిలెన్స్ ఇన్ఫోసిమెంట్ అధికారి ఉమామహేశ్వర్ అన్నారు. స్థానిక పిఎన్ఆర్ ఫంక్షన్ హాలులో శనివారం అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ కడప ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు డీలర్స్‌తో అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతాయుతంగా దేశానికి వెన్నెముక రైతులే కాబట్టి మనం వారికి వెన్నుదన్నుగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తొండూరు ఎఒ మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం ఎఎస్‌పిని సన్మానించారు. కార్యక్రమంలో ఎడిఎ కృష్ణమూర్తి, ఎఒ లావణ్య, శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి భరత్ రెడ్డి, విజిలెన్స్ ఎఒ బాలగంగాధర్ రెడ్డి, సిఐ ఉండూరు బాషా. సిబ్బంది పాల్గొన్నారు.

బడి, గుడి, ఇళ్ల మధ్య ఇటుకల బట్టీ వద్దు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

బడి, గుడి, ఇళ్లు ఉన్నచోట ఇటుకల బట్టీ నిర్మాణానికి అనుమతి ఇవ్వద్దని ఆర్‌డిఒ శ్రీనివాసులును ప్రజలు కోరారు. గూడెంచెరువు, రాజీవ్‌నగర్ కాలనీ వాసులు శనివారం సాయంత్రం ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణదారులు వరలక్ష్మి, లక్ష్మీదేవి, సునీత, ఈశ్వర్‌రెడ్డి, బాల సుబ్బయ్య, సుబ్బారెడ్డి, అంజి, గూడెంచెరువు, రాజీవ్ నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

టిడిపి అధికారంలోకి వచ్చేందుకు కృషి

ప్రజాశక్తి - జమ్మలమడుగు



చంద్రబాబును కలిసిన కె.ఖదీర్

రాష్ట్రంలో టిడిపి మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తామని టిడిపి రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి కళాయిగిరి ఖదీర్ పేర్కొన్నారు. విజయ వాడలోని పార్టీ కార్యాల యంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర బాబు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి దేవగుడి భూపేష్‌రెడ్డి సహాయ సహకారాలతో తనకు ఈ పదవి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కానివ్వనని తెలిపారు. పార్టీ ప్రతిష్టను మరింత బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో జమ్మలమడుగు ఎమ్మెల్యేగా దేవగుడి భూపేష్‌రెడ్డి విజయం కోసం నిరంతరం శ్రమిస్తామని ఖదీర్ పేర్కొన్నారు.

జెండాల మహబూబ్ బాషాకు సన్మానం

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి ముస్లిం మైనారిటీ కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా ఖాజీపేట సర్వర్‌ఖాన్‌పేటకు చెందిన జెండాల మహబూబ్ బాషా నియమితులైన సందర్భంగా శనివారం మైదుకూరు మైనారిటీ నాయకులు ఆయనకు అభినందనలు తెలుపుతూ సన్మానించారు. కడపజిల్లా తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా శుక్రవారం మంగళగిరి టిడిపి జాతీయ కార్యాలయంలో మహబూబ్ బాషా ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ ముస్లిం అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలంతా టిడిపికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మైనారిటీ నాయకులు పాల మాబు (14వ వార్డు కౌన్సిలర్), ఎద్దుల బండి షరీప్ (పట్టణ మైనారిటీ ఉపాధ్యక్షులు), షేక్ మహబూబ్ హుసేన్, మహబూబ్ బాషా (సహారా), సిగినేని శ్రీనివాసులు, మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - మైలవరం

దాల్మియా ఫౌండేషన్, పశుసంవర్థక శాఖ భాగస్వామ్యంతో శనివారం మండల పరిధిలోని నవాబుపేటలో నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేషణ స్పందన లభించింది. నవాబుపేట సర్పంచు శైలజ, వైసిపి నాయకులు వైఎస్ శివభాస్కర్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జమ్మలమడుగు డివిజన్ పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, రాఘవేంద్ర యాదవ్, పశువైద్యులు చికిత్సలు చేశారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ హెడ్ రామరాజు, కడప ప్లాంట్ పారిశ్రామిక సంబంధాల అధికారి హరికృష్ణ, సుధాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, దాల్మియా ప్లాంట్ పిఆర్ఒ జయరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులుగా మణికంఠారెడ్డి

కొండాపురం : ఎపి రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులుగా మండలంలోని చిన్నపల్లె గ్రామానికి చెందిన వి.మణికంఠారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో చరవాణిలో మాట్లాడుతూ రెడ్డి కులస్తులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తన తన నియామకానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో, మండలాల్లో రెడ్డి సేవా సంఘాన్ని ఏర్పాటు చేసి, వెనుకబడిన రెడ్డి కులాల అభ్యున్నతికి పాటుపడతానని తెలిపారు.

రోడ్లపై వాహనాలు నిలిపితే జరిమానా

వేంపల్లె : రోడ్లపై వాహనాలు ఎక్కడపడితే అక్కడ పెడితే జరిమానాలు విధించనున్నట్లు సిఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని దుకాణాల వద్ద శనివారం పెట్టిన వాహనాదారులకు వాటిని క్రమ పద్ధతిలో పెట్టుకోవాలని సిఐ సూచించారు. రోడ్లపై వాహనాలను ఇష్టానుసారం పెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనదారులు సహకరించాలని ఆయన కోరారు.



ఎపిఆర్ఎస్ న్యాయవాదుల విభాగ అధ్యక్షులుగా షౌకత్ అలీ



నియామక పత్రం అందుకుంటున్న షౌకత్ అలీ

పీలేరు: ఫూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి (పిఎఆర్ఎస్) పీలేరు నియోజకవర్గ న్యాయవాదుల విభాగం అధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది పి.షౌకత్అలీ ఎంపికయ్యారు. శనివారం పిఎఆర్ఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమన్వయకర్త ఎ.బలరాం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతి రావ్ పూలే, బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఎర్పాటైన పిఎఆర్ఎస్‌ను బలపరచి, బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పిఎఆర్ఎస్ పీలేరు మండల ప్రయివేటు టీచర్స్ విభాగం అధ్యక్షులు ఎ.మస్తాన్, నాయకులు మహమ్మద్ రఫీ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్ రికవరీ ఆపాలి : సిఐటియు



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల హెల్త్ అలవెన్స్ రికవరీ చేయాలనే ఉద్దేవంతో జీవో 109ను ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పట్టణాలు శుభ్రం చేస్తున్న కార్మికులకు ఇచ్చే హెల్త్ అలవెన్స్‌లో కోత విధించడం దారుణమని వాపోయారు. నిత్యావసర సరుకుల ధరలు, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు పెరుగుతున్నాయని, వేతనం మాత్రం పెరగడం లేదని వాపోయారు. పిఎఫ్ ఖాతాలు సరిచేయాలని, పెండింగ్‌లో ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ మూడు లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. 109 జీవోను ఉపసంహరించకపోతే పోరాటాలకు సన్నద్ధమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, రాంబాబు, రవి, మంగమ్మ, తిరుపాల్, ఆంజనేయులు, శంకరయ్య, వై. వెంకటరమణ పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్: మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ఉద్యమాలు తప్పవని సిఐటియు జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్ హెచ్చరించారు. మెడికల్ ఇన్సూరెన్స్‌ను జీతం నుంచి రికవరీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలలో ఎందరో నాయకులను చూశామనీ మున్సిపల్ కార్మికుల పట్ల ఇంతటి నిర్దయగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం ఇదేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, జీవో నెంబర్ 190 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రూ.26 వేలు వేతనం ఒక దఫా గానే ఖాతాలో జమ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఉత్తుత్తి హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చక పోగా కార్మికులకు నష్టం కలిగించే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీల పట్ల చిత్తశుద్ధి ఉంటే హెల్త్ అలవెన్స్‌ను జీతం నుంచి రికవరీ చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఒక సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు పిలుపునివ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు సి.హెచ్. ఓబయ్య, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి, మండల ప్రచార కార్యదర్శి రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, రవిశంకర్, సి.సురేష్, సాలమ్మ, పెంచలయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, ప్రజలకు పారదర్శక పాలనను అందించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని స్పందన హాల్‌లో కలెక్టర్ గిరీష ఆధ్వర్యంలో జిల్లా సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవిష్యత్తులోనూ ముఖ్యమంత్రి ఆలోచనా విధానాన్ని అందుకుని అన్నమయ్య జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లాలో 3,57, 400 ఎకరాలలో సాధారణ 2,6,7911 ఎకరాలలో 75 శాతం రైతులు సాగు చేశారన్నారు. 96 శాతం పూర్తి చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా స్థాయిలో సక్రమంగా, విజయవంతంగా అమలు చేయడం అధికారుల బాధ్యత అన్నారు. కలెక్టర్ నుంచి అధికారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అందరూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇరువురూ సమన్వయంతో ప్రతి గడపకూ పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నారు. అనంతరం కలెక్టర్ గిరీషా మాట్లాడుతూ ఎంపీ, శాసనసభ్యులు, ఎమ్మెల్సీ సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేవనెత్తిన అంశాలకు సంబంధించి ఆయా శాఖలపై తీసుకున్న చర్యలు, కార్యాచరణ నివేదిక నివేదికను సభ్యులకు అందజేశామన్నారు. అనంతరం జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుత్వ వీఫ్ కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పి. ద్వారకనాథరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, షాజహాన్, నియోజకవర్గాల వారిగా సమస్యలను వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాసులు, జెసి తమీమ్ అన్సారీయా, డిఆర్ఓ సత్యనారాయణ, ఆర్‌డిఓలురంగస్వామి, కోదండరామిరెడ్డి, మురళి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి : పీడీ

ప్రజాశక్తి-వీరబల్లి

డ్వాక్రా సంఘ సభ్యులు తీసుకొన్న రుణాలు సకాలంలో చెల్లించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాఖ్యలు తీసుకొన్న రుణాలు క్రమం తప్పక వసూలు అయ్యేలా సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు. గడికోట, సానిపాయ, వీరబల్లి, గుర్రప్పగారిపల్లి గ్రామ సమాఖ్యల్లో రికవరీ తక్కువగా ఉందని వెంటనే సమావేశాలు నిర్వహించి వసూళ్లు చేయాలన్నారు. సమాఖ్యల్లో పుస్తక నిర్వహణ సక్రమంగా చేసేలా చూడాలని సూచించారు. జగనన్నతోడు లబ్ధిదారులకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించాలని, జగనన్న కాలనీల లబ్ధిదారులకు రూ. 35 వేలు పావలా వడ్డీతో ఇప్పించాలన్నారు. త్వరలోనే ఆసక్తిగల పాడిరైతులకు పొట్టేల పిల్లల యూనిట్లకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఒక కేజీ రూ.460 చొప్పున యూనిట్ కు రూ. 25 వేల నుండి రూ. 50 వేల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎపియం ఖాదర్‌వలి, సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ



జడ్జి శ్రీనివాసులరెడ్డిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది, సిఐ

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు : జడ్జి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ర్యాగింగ్ పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులరెడ్డి అన్నారు. శనివారం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం, యాంటీ ర్యాగింగ్ అండ్ యాంటీ డ్రగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. భవిష్యత్తులో విద్యార్థులు ఏ విధంగా ముందుకు కొనసాగాలో సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. వాటి వలన కలిగే ఇబ్బందులు గురించి విద్యార్థులకు వివరించారు. రూరల్ సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ యువత చెడు దారిలో పడకుండా మంచి దారిలో నడిచి మంచి విద్యను అభ్యసించి ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ జ్యోతి సొసైటీ బి.సుభద్రలు, సుజాత, కళాశాల హెచ్ఒడిలు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చడం దుర్మార్గం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి నాయకులు ఇప్పటం గ్రామస్తుల ఇళ్లను కూల్చడం దుర్మార్గమని జనసేన నాయకులు పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావ సభకు స్థలం ఇచ్చినందుకే వైసిపి నాయకులు ఇప్పటం గ్రామస్తుల ఇళ్లను దౌర్జన్యంగా కూల్చివేశారని తెలిపారు. పేదల ఇళ్లపై దాడి చేసి జెసిబిలతో ఇళ్లు కూల్చడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య, జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కత్తి సుబ్బరాయుడు, జెడ్డా శిరీష, భాస్కర్ పంతులు, వెంకటయ్య, వెంకట సుబ్బయ్య, పోలిశెట్టి శ్రీనివాసులు, శంకరయ్య, వీరయ్య ఆచారి, గోపి పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వెంకటేశ్వర్లు అనే విద్యార్థి జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్రరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందులలో నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన పోటీలోనూ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.

చంద్రబాబుకు భద్రత పెంచాలి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-నందలూరు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుకు భద్రత పెంచాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరు వేణుగోపాల్ అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుపై ఎన్టీఆర్ జిల్లా నందిగామలో రాళ్లతో జరిగిన దాడికి పాల్పడటం దారుణమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజల ఆదరణ చూసి ఓర్చుకోలేక వైసిపి గూండాలు కరెంటు సైతం కట్ చేసి రాళ్లతో దాడి చేశారన్నారు. ప్రతిపక్ష నాయకుడికే రక్షణ కల్పించలేని హోం మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మొగిలి కాలవ శివ, జ్యోతి శివ, నరేష్, నాగయ్య పాల్గొన్నారు.

ఉరుసు ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల కేంద్రంలో జరుగు హజరత్ మహబూబ్ సుభాని ఉరుసు ఆహ్వాన పత్రికలను శనివారం దర్గా వద్ద దర్గా కమిటీ అధ్యక్షులు అగ్రహారం కాలేశా ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ 14వ సంవత్సర ఉరుసు ఉత్సవాలు 12వ తేదీన దీపోత్సవం, 13న గంధోతవం, 14వ తేదీన ఉరుసు, ఖవాలీ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సునీల్ బాషా, కమిటీ సభ్యులు అగ్రహారం జహీర్, జావీద్, మహమ్మద్, రఫీ, రియాజ్, ఇంతియాజ్, మస్తాన్, జగదీష్, అటో వలి పాల్గొన్నారు.



ఉరుసు ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న సభ్యులు



అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులతో మాట్లాడుతున్న సిడిపిఒ

అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పంచాయతీలోని పకీర్‌రెడ్డిపల్లెలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో శనివారం లక్కిరెడ్డిపల్లె సిడిపిఒ పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల రిష్టర్‌ను పరశీలించారు. 140 మందికి గానూ 11 మంది చిన్నారులు, 64 మంది గర్భిణులకు ఒక్కరు, 11 మంది బాలింతకు ఒక్కరు మాత్రమే ఉండడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిష్టర్‌లో మాత్రము వంద శాతం హాజరును ఎలా చూపుతున్నారని ప్రశ్నించారు. మెనూ ప్రకారం రోజు భోజనం పెడుతున్నారా అని ప్రశ్నించారు. శనివారం రోజు వెజిటేబుల్ బిర్యానీ, పిల్లలకు పాలు, గుడ్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం అన్నం, రసంతో సరిపెడుతున్నారని తల్లిదండ్రులు ఆమెకు ఫిర్యాదు చేశారు. ఒక నెలకి ఇచ్చే సరుకులు మరో నెలలో ఇవ్వడంలేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్టాక్ రిజిస్టర్ గుడ్లు, బేడలు సమృద్ధిగా ఉన్నాయని, ఇంటి వద్ద వంట చేసుకుని ఇక్కడ వడ్డీస్తున్నారని తెలిపారు. ఆయాపై అనేక విమర్శలున్నాయని దానిపై విచారిస్తున్నామని పేర్కొన్నారు. వీటిపై జిల్లా ఉన్నతాధికారులకు తెలియ జేస్తామని తెలిపారు.

వాహనదారులకు ఎస్ఐ కౌన్సెలింగ్

గాలివీడు: ఆర్టీసీ బస్టాండ్‌లో ద్విచక్ర వాహనాలను ఉంచితే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్ఐ వెంకట శివకుమార్ పేర్కొన్నారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లో పర్యటించారు. అక్కడ ఉంచిన ప్రయివేట్ వాహనాలను పరిశీలించి సంబంధిత వాహనదారులను పిలిచి హెచ్చరించారు. బస్టాండ్‌లో వాహనాలు నిలుపుదల చేయకుండా గమనించాలని అక్కడి వ్యాపారులకు సూచించారు. బస్టాండ్లో బస్సు నిలవడానికి స్థలం ఉండాలని, ఆ స్థలంలో వాహనాలు ఉంచితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట శివకుమార్

రాష్ట్రంలో రాక్షస పాలన : ఆర్ఆర్

రాయచోటి: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు పర్యాయాలు ముఖ్యమంత్రి, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడిపై రాళ్ల దాడి చేయడం దారుణమని వాపోయారు. వైసిపి ఆరాచక, నిరంకుశ పాలనపై ప్రజలలో చైతన్యం తీసుకొస్తున్నారనే నెపంతోనే జరిగిన దాడి చేశారని పేర్కొన్నారు. మాజీ మంత్రి అయ్యన్న పాత్రాడు అరెస్టు దుర్మార్గంన్నారు. ఈ విధమైన దాడి తాము చేయాలనుకుంటే వై.ఎస్. జగన్ పాదయాత్ర మూడు అంగుళాలు కూడా ముందుకు సాగేది కాదని తెలిపారు. చంద్రబాబు క్రమశిక్షణతో కూడిన రాజకీయం నేర్పించారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మానసిక పరిస్థితి సరిగ్గా లేదన్నారు. తెల్ల దొరల్లా బెదిరించి పరిపాలించాలనే తత్వం ఆయనది అని పేర్కొన్నారు. వైసిపి బెదిరింపులకు భయపడే వారు ఎవరు లేరని తెలిపారు. ఇసుక, మట్టి, మద్యం, ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం చేయడం వల్ల వచ్చే సొమ్ముతో పరిపాలన చేస్తున్నారున్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాష, పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలి, మైనారిటీ నాయకులు అబూజర్, జావెద్,కొట్టే చలపతి,బాబు రెడ్డి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

రాజంపేట అర్బన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన వారి నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తమ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో తెలుగు-1, గణితం-1 పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో పాసై ఉండాలన్నారు. నెట్, సెట్, పిహెచ్‌డి కలిగి ఉండాలన్నారు. టీచింగ్‌లో అనుభవం గలవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

భూ సర్వేతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

గ్రామాల్లో నెలకొన్న భూ వివాద సమస్యలకు భూ సర్వేతో సమస్యలు పరిష్కారం అవుతాయని వాల్మీకిపురం తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. శనివారం మండలంలోని జర్రావారిపల్లిలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరిగే భూసర్వేకు రైతులు సహకరించాలని, భూ సర్వే వలన ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునిభాస్కర్, పంచాయతీ కార్యదర్శి భారతమ్మ, సర్వేయర్ నవీన్ రెడ్డి, వైసిపి నాయకులు గురుమూర్తి, రాజ, చంద్ర, రామారావు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఎన్నాళ్ళుగా ఎదురు చూస్తున్న సెల్ టవర్ ఏర్పాట్లు కోరిక తీర్చినందుకు మర్రిమాకులపల్లి సర్పంచ్ జ్యోతి, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.మర్రికులపల్లి గుట్టల ప్రాంతంలో ఉండడంతో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి కృషితో బిఎస్ యన్ ఎల్ 4-జి సెల్ టవర్ మంజూరు అయింది. ఎంపీ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ సెల్ టవర్ లేకపోవడంతో వినియోగదారులు ప్రజలు బయోమెట్రిక్, ఈ కేవైసీ, పెన్షన్స్ పంపిణీ, రేషన్ బియ్యం పంపిణీల కోసం పలుఅస్తులు పడుతూటవర్ వచ్చే ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చేది సమస్య తీర్రంతో గ్రామంలో ఆనందం వ్యక్తం చేశారు.

మొక్కుబడే!

ప్రజా'దృష్టి'

'వొట్టిమాటలు కట్టిపెట్టి గట్టిమేల్ తలపెట్టవోయ్' అన్న స్ఫూర్తి మంత్రం కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో మచ్చుకైనా కనిపించిన దాఖలాల్లేవ్. రెండ్రోజుల కిందట రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో రాష్ట్ర హెల్త్‌సెక్రటరీ కృష్ణబాబు ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆడిటోరియంలో నిర్వహించిన సమీక్ష మాటల గారడీగానే మిగిలి పోయింది. రీజినల్ డైరెక్టర్ పరిధిలోని వైద్యుల, నర్సింగ్ పోస్టుల ఖాళీల వివరాలు, వ్యాకినేషన్ సరళి, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు, పారిశుధ్య కార్మికులకు జీతాలు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, మందుల కొరత వంటి అంశాల ఆరా తీయడం వరకు భాగానే ఉంది. ప్రభుత్వాస్పత్రుల్లోని మందుల నాణ్యత, మందుల సంఖ్య ఎంత, మార్కెట్లోని మందుల నాణ్యతను తలపిస్తున్నాయా, లేదా అనే అంశాలను పరిశీలించాల్సి ఉంది. ఇటువంటి లోతైన పరిశీలనతో మరింత మేలు ఒనగూరి ఉండేది. ప్రభుత్వాస్పత్రుల్లో స్కానింగ్ సెంటర్ల మరమ్మతులను సత్వరమే చేయడానికి అవసరమైన చర్యలపై దృష్టి సారించి ఉంటే వేలాది రూపాయలు ప్రయివేటు స్కానింగ్ సెంటర్లకు ముట్టజెప్పుకునే దుస్థితి తగ్గి ఉండేది. ప్రభుత్వా స్పత్రుల్లోని వైద్యుల వేతనాలను హేతుబద్ధీకరించిన అనంతరం వైద్యుల ప్రయివేటు ప్రాక్టీస్‌ను నిలువరిస్తే మరింత ప్రయోజనం లభించేది. కడప ప్రభుత్వాస్పత్రిలో పని చేసే నాణ్యమైన స్పెషలిస్టు వైద్యులను సిహెచ్‌సి, పిహెచ్‌సిలకు పంపడం ఎంతవరకు కరెక్టో ఆలోచన చేయాలి. నాణ్యమైన స్పెషలిస్టు వైద్యులను కడప, ప్రొద్దుటూరు వంటి జిల్లాస్థాయి ఆస్పత్రుల్లో ఉంచితేనే నాణ్యమైన వైద్యం అందేది. పిహెచ్‌సి, సిహెచ్‌సిల్లో స్పెషలిస్టు వైద్యం అందించడానికి సంబంధించిన పరికరాలు ఉండవనే విషయం అందరికీ తెలిసిందే. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉరుముతోంది. పేరు ఫ్యామిలీ డాక్టర్, ఆచరణ ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకున్న రోగులకు, దీర్ఘకాలిక రోగులకు మాత్రమే వైద్యసేవలు అందించడానికి పరిమితం చేయడాన్ని ఫ్యామిలీ డాక్టర్ విధానమని ఎలా అంటారో పాలకులకే తెలియాలి. ఇది 104 వైద్య సేవల తరహాకు పరిమితం కావడమనే వాదన వినిపిస్తోంది. రీజినల్ డైరెక్టర్ పరిధిలోని వైద్యుల, ఎఎన్ఎంల, స్టాఫ్‌నర్సుల లభ్యత, కొరత, హేతుబద్ధత, సర్దుబాటును ప్రశ్నించడం సరే, కిందిస్థాయి ఉద్యోగుల బదిలీల జాతరలో సాగుతున్న అవినీతి కట్టలు తెంచుకుంటోంది. ఇటువంటి కీలక అంశాల్లో పారదర్శ కతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో వైద్యఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లను ఇష్టారాజ్యంగా చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇటు వంటి సమీక్షలను మూడు నెలలకు ఒకసారి విద్య, వైద్యం, వ్యవసాయం, నీటిపారుదల, పరిశ్రమలు వంటి కీలకమైన డిపార్టుమెంట్ల పురోగతి పట్ల లోతుగా సమీక్షలు నిర్వహిస్తే జవాబు దారీతనం పెర గడంతోపాటు ఫలితాలు ఉంటాయని చెప్పవచ్చు. డిపార్టుమెంట్ల వారీగా నిస్తేజంగా ఉన్న అధికారుల్లో కదలిక తేవాల్సి ఉంది. జిల్లా పరిషత్, డిఆర్‌సి వంటి సమావేశాల తరహాలో తంతుగా సమీక్షలు నిర్వహిస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

- ప్రజాశక్తి- కడప ప్రతినిధి

దేశానికే ఆదర్శం జగనన్న పాలన : మంత్రి కాకాని

ప్రజాశక్తి-రామాపురం

దేశానికే రైతు సంక్షేమంలో జగనన్న పాలన ఆదర్శంగా నిలిచిందని అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఆకేపాటి అమర్‌నాథరెడ్డితో కలసి కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సంక్షేమ ఫలాలు అందించడంలో పంటల బీమా వందశాతం ప్రభుత్వమే భరిస్తూ ప్రీమియం చెల్లించడంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. నామినేషన్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలు 50 శాతం పదవులు ఇవ్వడంలో దేశ చరిత్రలోనే జగన్‌కే దక్కిందన్నారు. గతంలో రైతులు విత్తనాలకు, ఎరువులకు మండల కేంద్రాలలో పొడిగాపులు కాసిన రోజులు చూశామని తెలిపారు. ఇప్పుడు గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు నేరుగా ఎరువులు విత్తనాలు అందజేయడం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎల్లో మీడియాకు కనిపించడం లేదన్నారు. చంద్రబాబు పాలనలో కరువు విలయతాండం చేసిందన్నారు. రాయచోటి నియోజకవర్గం ప్రాంతానికి శ్రీకాంత్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని ఆయన కొనియాడారు రాయచోటిని జిల్లా కేంద్రం చేయడానికి మిథున్ రెడ్డితో కలిసి శ్రీకాంత్ రెడ్డి ఎనలేని కృషి చేశారని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ తండ్రి ఆశయాలకు అనుగుణంగా కుమారుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం ఉచిత విద్యుత్తు అమలు చేస్తూ చరిత్రలో నిలిచారన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్దకే పాలన సాగిస్తున్నారన్నారు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం నియోజకవర్గంలో సాగు, తాగునీరు అందించని రోజున రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సభాముఖంగా చెప్పారు. నిత్యం కరువు తాండవిస్తున్న నియోజకవర్గంలో సాగు, తాగునీరు అందించాలని సంకల్పంతో నిరంతరమూ పనిచేస్తున్నానని చెప్పారు. గడపగడపకు ప్రభుత్వం లో భాగంగా ఇంటింటికి వెళ్లినప్పుడు వారు లబ్ధి పొందిన వివరాలు తెలియజేస్తున్నప్పుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం మేయర్, శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం, కోడూరు ఎంఎల్ఎ కొరముట్ల శ్రీనివాసులు, పీలేరు ఎంఎల్ఎ చింతల రామచంద్రారెడఇడ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి

లాంఛనంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కర్ణపు విశ్వనాథరెడ్డిచే వ్యవసాయ శాఖ ఏడీ లాంఛనంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతోపాటు వైస్ చైర్మన్ షాజహాన్, పాలకమండలి సభ్యులు చే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్‌తో సహా పాలకమండలి సభ్యులను పలువురు దుశాలతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు చిదంబర రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ దండు గోపి, వీరాంజనేయ ప్రసాద్, మాజీ ఎంపిపి ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపిపి రవిశంకంర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి సుర వెంకటసుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుల రెహ్మాన్ హబీబుల్లాఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగభూషణ్ రెడ్డి, మాజీ ఎంపిపి పోలుసుబ్బారెడ్డి, మండల బిసి నాయకులు పల్లపు రమేష్ ఎపిఎండిసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర వడ్డెర సంఘం డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.



క్షయ రోగికి పౌష్టికాహారం అందజేస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-నందలూరు

ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నందలూరు పంచాయతీ దుర్గపురంలో ఉంటున్న క్షయ వ్యాధిగ్రస్తురాలు లక్ష్మీదేవిని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ శనివారం దత్తత తీసుకున్నారు. 9 నెలల పాటు పౌష్టిక ఆహారం ఇవ్వనున్నట్లు టిబి యూనిట్ అధికారిని డాక్టర్ సృజన తెలిపారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తురాలికి ఒక నెల పౌష్టికాహారం సర్పంచ్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మండలంలో మిగతా 15 మంది పేద క్షయ రోగులకు పౌష్టిక ఆహారం అందించడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దాత జంబు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం ఒక నెల పౌష్టికాహారం అందజేశామని తెలిపారు. మిగిలిన ఎనిమిది నెలల పాటు కూడా బాధితురాలిని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ రామసుబ్బారెడ్డి, టిబి సూపర్‌వైజర్ జయప్రకాష్, శివరాం, మండల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మట్టితరలించి రహదారిని బాగు చేస్తున్న నాయకులు

సొంత నిధులతో రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని బడికాయలపల్లెకి వెళ్లే రోడ్డు మట్టితో నిర్మించారు. ఈ రోడ్డు వాహనాల రాకపోకలు, పాదచారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి మొత్తం గుంతలమయమైంది. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు. విషయం తెలుసుకున్న వైసిపి రాయచోటి నియోజవర్గం పరిశీలకుడు పాగొండ ఖలీల్ అహ్మద్, బడికాయల పల్లి ఈశ్వర్‌రెడ్డి, రాయల్ సలీం, జీవీ రామకృష్ణ, అభిలాష్, ప్రదీప్ తదితరులు తమ సొంత నిధులు వెచ్చించి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి రోడ్డుపై ఏర్పడిన గొయ్యిలని పూడ్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడికాయలపల్లెకు రోడ్డు మంజూరు అయిందని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని వారు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రస్తుతానికి మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథరెడ్డి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - వీరబల్లి

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటరు నమోదుకు కేవలం రెండు రోజుల మాత్రమే గడువు ఉందనిసోషల్ మీడియాలో వస్తున్న రూమర్లు పట్టించుకోకుండా ఈనెల 7లోగా నమోదు చేసుకోవాలని విఆర్డీఎస్ సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం పాత్రికేయులుతో మాట్లాడుతూ జిల్లాలో అధిక సంఖ్యలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఉన్నప్పటికి ఓటరు నమోదు చాలా తక్కువగా ఉందని చెప్పారు. పదిమందికి అవగాహన కల్పించే పట్టభద్రులు, ఉపాధ్యాయులే ఓటరు నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఓటు నమోదు శాతం ఎక్కువ ఉన్నట్లయితే నిజాయితీ గల నాయకులను ఎన్నుకొనేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. నమోదు చేసుకోని వారు వారి వివరాలను తమకు వాట్సప్ ద్వారా 9490028324కు పంపితే తాము ఉచితంగా నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో తుమ్మల రమేష్ పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి ప్రజా సమస్యలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి రూరల్ మండలంలోని పల్లెల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని వివిధ శాఖల అధికారులు దృష్టి తీసుకువచ్చిన ఆ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయడమే జనం కోసమే జనసేన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జనసేన నాయకులు మైఫోర్స్ మహేష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు 45 రోజులుగా పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పాదయాత్రలో భాగంగా సిటిఎం గ్రామంలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. సిటిఎం గ్రామంలోని మసీదు వీధి, శెట్టివారివీధి, గొల్లపల్లిమిట్ట వీధుల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగాలేదని పేర్కొన్నారు. ఎస్టీ కాలనీలో వీధి దీపాలతో పాటు చాలా మందికి కనీస గృహాలు కూడా లేక గుడిసెలు నివసిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల గురించి సిటిఎం గ్రామ సచివాలయంలోని సచివాలయం అధికారులకు అర్జీ సమర్పించి సత్వరమే ఈ సమస్యల పరిష్కారాన్ని కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గంగాధర, జైకుమార్, షాదుల్లా, చోటు, బబ్లు, జయంత్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు


'టీకాలతోనే శిశువు ఆరోగ్యానికి భరోసా'

ప్రజాశక్తి-పీలేరు

శిశువుల భవిష్యత్ ఆరోగ్యం టీకాలతోనే సాధ్యమని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి రమేష్ రెడ్డి ఆదేశాల మేరకు, శనివారం పీలేరు మండలం, మేళ్ళ చెరువు గ్రామంలో శిశువులకు, నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొని సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధినిరోధక టీకాలు వాటి ప్రాముఖ్యత, అవశ్యకతపై తల్లిదండ్రులకు సమగ్ర అవగాహన అవసరమని అన్నారు. శిశువుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రాణాంతక వ్యాధులు సోకకుండా వ్యాధినిరోదక టీకాలు ఇప్పించడం ప్రతి తల్లికీ బాధ్యతగా భావించాలని చెప్పారు. టీకా ఇచ్చినప్పుడు తేలికపాటి జ్వరం, నొప్పి కొందరిలో సహజమని, ఇది సహజ రక్షణ వ్యవస్థ బలోపేతం కావడంలో ఒక భాగమని గుర్తించాలన్నారు. శిశు ఆరోగ్య సేవల్లో రోగ నిరోదకత ప్రధానాంశమని, టీకాలు నిర్దేశించిన సమయానికి పిల్లలకు తప్పక వేయించాలని చెప్పారు. టీకాలు పొందడం శిశువు యొక్క జన్మ హక్కు అని పేర్కొన్నారు. వ్యాధుల నిర్మూలనలో ఆవి ఆశించిన ఫలితాలు ఇస్తాయన్నారు. టీకాలు వేయించక పోతే శిశువులకు వ్యాదులు, అంగవైకల్యం, మరణాలు సంభవించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కావున ప్రతి బిడ్డకూ సంపూర్ణ ఆరోగ్య సౌంతం కావాలంటే వ్యాధి నిరోదక టీకాలు తప్పక ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో పర్యవీ క్షకులు కృష్ణయ్య, ఏఎన్ఎం నాగవేణి, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య



నియామక పత్రాన్ని అందుకుంటున్న రవీంద్రారెడ్డి

ఆపస్ జిల్లా ఉపాధ్యక్షులుగా రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులుగా రవీంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పివిసి ప్రభుత్వ పాఠశాలకు చెందిన రవీంద్రారెడ్డి శనివారం జిల్లా అధ్యక్షులు రమణా రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆపస్ నాయకులు నాగరాజ, మధుబాబురెడ్డి, దుర్వాసులు నాయుడు పాల్గొన్నారు.



విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ గౌరీశ్రీ

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయవచ్చునని పుంగనూరు హెూమియోపతి డాక్టర్ గౌరీశ్రీ తెలిపారు. శనివారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఉచిత హెూమియోపతి వైద్య శిబిరం నిర్వహించి, విద్యార్థులకు అవగాహన కల్పించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఆటలమ్మ తదితర వ్యాధులు దోమల వలన వ్యాప్తి చెందుతాయని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా దోమలు వ్యాప్తి చెందుతాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల వ్యాప్తి, తీసుకోవాల్సిన నివారణ చర్యలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గుణశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్‌లు ప్రమీల, చౌడమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరుగు పందెం పోటీలో పాల్గొంటున్న విద్యార్థులు

అట్టహాసంగా క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈ నెల 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వి ఆర్ విత్ యు ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కొత్త బోయినపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పరుగు పందెం, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, లాంగ్ జంప్, హైజంప్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, ఎలక్యూషన్‌తో పాటు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడల వలన పిల్లలకు ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం కూడా లభిస్తుందని అన్నారు. విద్యార్థులు కూడా పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షులు భాను ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులలో పోటీ తత్వం అలవరచేందుకు, తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలిగేందుకు ఈ క్రీడా పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు స్నేహలత, కార్యదర్శి గణేష్, సంయుక్త కార్యదర్శి కార్తీక్, సభ్యులు లోకేష్, అశ్వత్, వినయ్, హాజీ, బాలాజీ, హేమంత్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా ఖలీల్ అహ్మద్

ప్రజాశక్తి - బి.కొత్తకోట

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన పాగొండ ఖలీల్ అహ్మద్ నియమితులయ్యారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో శనివారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సమక్షంలో ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ప్రకటించారు. అదే సభలో అందరికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గడికోట శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలుపుకొంటున్నానని తెలిపారు. పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

పెన్షనర్లు పొదుపు వివరాలివ్వాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ పెన్షన్‌దారులు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు సౌకర్యం పొందడానికి తమ పొదుపు వివరాలను తెలియజేయాలని పీలేరు తాలూకా ప్రభుత్వ పెన్షన్ దారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వగళ్ళ చంద్రా రెడ్డి, జి. యమ్రరాజు తెలిపారు. శనివారం వారు ఈ మేరకు ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ముఖ్యంగా పొదుపు ఖాతాల వివరాలు అంటే ఫిక్సడ్ డిపాజిట్లు, జీవిత బీమా, గృహ రుణాలు మొదలగు వివరాలను ఈనెల 15లోగా పీలేరు ఉపఖజానాధికారికి నేరుగా కానీ, ఆన్లైన్ ద్వారా గానీ సమర్పించాలని వారు తెలియపరిచారు. మరిన్ని వివరాలకు 9490921660 సెల్ నెంబరుకు సంప్రదించాలని కోరారు.

ప్రధాన కార్యదర్శిగా నక్కా గోపాల్‌కృష్ణ

ప్రజాశక్తి గుర్రంకొండ

రాయల పీపుల్ ఫ్రెండ్ రాయలసీమ ప్రధాన కార్యదర్శిగా నక్కా గోపాలకృష్ణను నియమిస్తూ రాష్ట్ర పీపుల్ ఫ్రెండ్ అధ్యక్షులు తిరుమల రాజశేఖర్ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియ మించడంపై మరింత బాధ్యత పెరిగిందని అలాగే ఎల్లవేళలా కులం యొక్క సంస్కృతి సంప్రదాయాలను తన వంతు సహాకలలో ఎల్లవేళలా అందిస్తానని తనకు కేటాయించిన ఈ బాధ్యతలను స్వీకరిస్తూ కృతజ్ఞతలు తెలిపారు



ఎన్‌సిసికి ఎంపికైన విద్యార్థులు

ఎన్‌సిసిలో చేరేందుకు విద్యార్థుల ఆసక్తి

ప్రజాశక్తి-పీలేరు

సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 2022-23 విద్యా సంవత్సరానికి ఎన్‌సిసిలో ప్రవేశాలపై ఆసక్తి కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. శనివారం కళాశాల ఆవరణంలో ఎన్‌సిసిలో ఆసక్తి ఉన్న విద్యార్థులకు తిరుపతి ఆర్మీ అధికారులు హవాల్దార్ భాస్కర్ శారీరక దారుఢ్య పరీక్షలను నిర్వహించారన్నారు. అనంతరం వారికి రాత పరీక్షను పెట్టారని చెప్పారు. ఈ పరీక్ష ద్వారా 19 మంది విద్యార్థులకు ఎన్‌సిసిలో ప్రవేశం లభించిందని చెప్పారు. విద్యార్థి దశలో ఎన్‌సిసిలో చేరడంవల్ల బహుళ ప్రయోజనాలు చేకూరటమే కాకుండా పరోక్షంగా దేశానికి సేవ చేసినట్లేనని అన్నారు. అంతే కాకుండా వారికి భారత సైన్యం నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. అలాగే వారికి చక్కటి క్రమశిక్షణ అలవడుతుందని, తద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలోనూ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఎంపికైన ప్రతి విద్యార్థీ చక్కగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు డాక్టర్ ఎం. వెంకటరమణయ్య, సంధ్య, చంద్రబాబు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

ఎస్‌వి.జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం బైపిసి చదువుతున్న యర్రదొడ్డి గౌతమికి మానవతా స్వచ్ఛంద సేవా డైరెక్టర్ సామాల నరసింహారెడ్డి, కో-చైర్మన్ నందలూరి శివశంకర్‌రెడ్డి సూచన మేరకు శనివారం రూ.3 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి శివయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముఖచిత్ర ఆభరణం వితరణ

ప్రజాశక్తి - తంబళ్లపల్లి



ఈశ్వరుడి వెండి విగ్రహం

మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామికి స్వామి వారి ముఖచిత్రంతో ఉన్న వెండి ఆభరణాన్ని దాత వితరణ చేశారు. మండలంలోని బురుజుకు చెందిన జి.ఈశ్వరప్ప బెంగళూరులో ఎలహంకలో స్థిరపడ్డారు. ఆయన స్వామి వారికి సుమారు రూ.5 లక్షలు విలువ చేసే ఆరు కిలోల వెండి విగ్రహాన్ని తయారు చేయించారు. ఆదివారం కుటుంబీకులతో కలిసి స్వామివారికి ఆభరణాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకలతో ముక్కలు తీర్చుకున్నామని దాత తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న సంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు.

శాంతి భద్రతలు క్షీణించడం దురదృష్టకరం

వేంపల్లె :రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకు దిగజారడం దురదృష్టకరమని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాజీ సిఎం చంద్రబాబు కాన్వాయ్‌పై దుండగులు రాయి విసరడంతో చీఫ్ సెక్యూరిటీ అధికారి మధుకు రక్త గాయం కావడం దారుణమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి సక్రమంగా లేదనడానికి చంద్రబాబుపై రాయి విసరడం తాజా ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ దుశ్చర్యను ఖండిస్తున్నట్లు చెప్పారు. నిందుతుడిని అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలన్నారు.

చేనేతపై జిఎస్‌టిని రద్దు చేయాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): చేనేత ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం విధించిన 5 శాతం జిఎస్‌టిని రద్దు చేయాలని కడప జిల్లా చేనేత పరిరక్షణ కమిటీ అధ్యక్షులు కారుమూరి వెంకటరమణయ్య డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాల్లో పట్టణ, మండలాల్లో తరతరాలుగా కులవృత్తులను చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. వాటిని నమ్ముకుని జీవనాన్ని కొనసాగిస్తున్న చేనేతలకు ప్రభుత్వం అండగా నిలబడాల్సి ఉందన్నారు. నూలు, సిల్క్ రంగులకు రాయితీలు, సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న తహశీల్దార్

ఆరోగ్య ప్రచారకర్తలుగా లేబాక విద్యార్థులు

ప్రజాశక్తి-నందలూరు

ఆరోగ్య ప్రచారకర్తలైన లేబాక విద్యార్థులను తహశీల్దార్ ఉదయ శంకర్‌రాజు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉమామహేశ్వరి, రెడ్డిసంకీర్తన మాట్లాడుతూ వంట నూనెలను మళ్ళీ మళ్ళీ కాచి ఉపయోగించడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. ఎఫ్ఎస్ఎస్ఎఐ(ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) వారి సూచన ప్రకారం వంట నూనెను మూడు సార్లకు మించి వాడకూడదని తెలిపారు. విద్యార్థులను ఎంపిడిఒ సౌభాగ్యం, ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నందలూరు

సచివాలయంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రామసుబ్బారెడ్డి దీర్ఘకాలిక వ్యాధులైన బిపి, సుగర్, కేన్సర్ రోగులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సాధారణ రోగులకు 50 మంది, బిసి 30 మంది, 25 మంది మధుమేహులకు పరీక్షలు నిర్వహించామని డాక్టర్ సృజన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

క్రైం కార్నర్



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సునీత

తండ్రి, కుమార్తెపై ఆకతాయిల దాడి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తండ్రి, కూతురుపై ఆకతాయిలు దాడి చేసి గాయాలు పాలు చేసిన ఘటన శనివారం రామ్‌నగర్‌లో చోటుచేసుకుంది. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న సునీత, ఆమె తండ్రి వెంకట నరసయ్యలు తమ దుకాణానికి అడ్డంగా ఉంచిన ఆటోను తీయమన్నందుకు హరీఫ్, హనీఫ్, సలీం అనే యువకులు తండ్రి, కూతురుపై దాడి చేయడంతో గాయాల పాలైన వారిరువురు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తండ్రి వెంకట నరసయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇదే యువకులు గత కొన్ని రోజులుగా సునీత కళాశాలకు వెళ్లే సమయంలో ఆమెను వేధించేవారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీ : వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి ములకలచెరువు

మండలంలోని చౌడసముద్రం గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి అనే వృద్ధురాలిని శనివారం ఉదయం ఇంటి ముందు చెత్త ఊడుస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను కుటుంబ సభ్యులు 108 వాహనంలో చికిత్సల నిమిత్తం హుటాహుటిన మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం బాధితురాలు పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో డాక్టర్ల సలహా మేరకు తిరుపతి ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మోసగాడు అరెస్టు : రూ.3.50 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమాయక ప్రజలను మోసం చేయడానికి ఎటిఎం సెంటర్లనే టార్గెట్‌గా ఎంచుకుని ఎవరైనా డబ్బులు డ్రా చేసేందుకు వచ్చినప్పుడు వారి కార్డులు తీసుకొని ఇతని దగ్గర ఉన్న డూప్లికేట్ కార్డులు ఇచ్చి వారి అకౌంట్లో ఉన్న డబ్బులు అన్నింటిని తీసేసుకుని జల్సాలు అలవాటు పడ్డ మోసగాడిని అరెస్టు చేసినట్లు టూ టౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎటిఎంలో మోసపోయిన బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేసులో నిందితుడిని గుర్తించామన్నారు. కడప జిల్లా మైదుకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి జల్సాలకు అలవాటు పడి నేరాలు చేస్తూ హైదరాబాదులోని రామోజీ ఫిలిం సిటీలో ఉన్న జూనియర్ ఆర్టిస్టులతో కలిసి విలాసాలు చేసేవాడని తెలిపారు. ఇతనిపై గతంలో కడప, కర్నూలు, నంద్యాల ప్రాంతాలలో పలు కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఇతను నేరం చేసిన తరువాత ఒక చిన్న క్లూ ఆధారంగా తన ప్రియురాలతో కలిసి షాపింగ్ చేస్తున్న సమయంలో సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో అతని మొబైల్ నెంబర్‌ను ట్రేస్ చేసి అతనిని గుర్తించి మదనపల్లి సిటిఎం రోడ్డులోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ ఎటిఎం వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ప్రజలు ఎటిఎం సెంటర్ల వద్ద డబ్బులు డ్రా చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కొత్త వ్యక్తులు నమ్మరాదని ఎవరికైనా అనుమానం వస్తే వెంటనే సమీపంలోని సెక్యూరిటీ గార్డులకు తెలియజేయాలని లేదా వెంటనే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తులో మదనపల్లి టూ టౌన్ ఎస్ఐ జి.చంద్రమోహన్, క్రైమ్ పార్టీ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ శంకర, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు రాఘవరెడ్డి, అబ్దుల్లా, మునిరత్నం, ప్రసాద్, భద్ర నాయక్, క్రైమ్ పార్టీ సిబ్బందిని ఉన్నతాధికారుల అభినందించారు.



మాట్లాడుతున్న సిఐ మురళీకృష్ణ